క్లుప్తంగా

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాగనూర్: పశువుల ఆరోగ్య సంరక్షణపై పెంపకందారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పశుసంవర్ధక శాఖ జూనియర్ అసిస్టెంట్ శశికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కొల్పూర్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందుజాగ్రత్త చర్యగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

విధిగా టీకాలు వేయించాలి

దామరగిద్ద: పశువులకు విధిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని అయ్యవారిపల్లిలో 139 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది త్రివేణి, లాలప్ప, నర్సిమేలు, కనకప్ప, భీంషప్ప పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ : కేసు నమోదు

దామరగిద్ద: మండలంలోని పిడెంపల్లిలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రోడ్డుపై తవ్విన చిన్నపాటి కాల్వ ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఎస్‌ఐ పి.రాజు వివరాల మేరకు.. మండలంలోని పిడెంపల్లిలో మంగళవారం గ్యార్వీ వేడుకలు నిర్వహించడంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. దీంతో ఎస్సీ కాలనీవాసులు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్‌గా సన్నటి కాల్వను తవ్వారు. రోడ్డుపై కాల్వ ఏర్పాటుతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడుతున్నారని మరో వర్గం వారు వాదనకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఒక దశలో ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. రెండు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

మద్దూరు: ఉమ్మడి మండలంలోని కొమ్మూరుకు చెందిన జ్యోతి (19) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు. ఈ నెల 14న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదని.. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. యువతి తండ్రి గంగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపుతప్పి కంటైనర్ బోల్తా

కొత్తకోట రూరల్: కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మంగళవారం రాత్రి కొత్తకోట బైపాస్‌లోని ఛత్రపతి విగ్రహం సమీపంలో చోటు చేసుకుంది. డ్రైవర్ రాఘవేంద్ర తెలిపిన వివరాల మేరకు బెంగళూర్ నుంచి పార్సిల్ లోడ్‌తో హైదరాబాద్ వెళ్తుంది. కంటైనర్ రాత్రి 11గంటల సమయంలో కొత్తకోట సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ సైడ్ ఇచ్చినట్లే ఇచ్చి.. కంటైనర్‌కు అడ్డం రావడంతో డ్రైవర్ అదుపు చేసే క్రమంలో రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. బుధవారం ఉదయం ఘటన స్థలానికి చేరుకున్న హైవే సిబ్బంది రోడ్డు కింద పడిన కంటైనర్‌ను క్రేన్ సహాయంతో బయటకు తీశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నెకు చెందిన మిట్టకడుపుల మహేష్ మంగళవారం రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న మహేష్ దసరాకు సొంత గ్రామానికి వచ్చాడు. తల్లిదండ్రులు నర్సింహ, నర్సమ్మ తరచూ గొడవ పడుతుండటంతో క్షణికావేశానికి లోనై ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి.. తర్వాత వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మక్తల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్/మాగనూర్/కృష్ణా: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్, మాగనూర్, కృష్ణా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు వరి సన్నరకాలకు రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. చివరి గింజ వరకు మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలని తెలిపారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల్లో గన్నీబ్యాగుల కొరత లేకుండా చూడాలన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్‌లో పలు గ్రామాలకు చెందిన వారికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ప్రత్యేకంగా నిధులు తీసుకువచ్చి, ప్రజలకు అవసరమైన పనులు చేపడతామన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమాల్లో జిల్లా సివిల్‌సప్లై అధికారులు రాంగోపాల్, సుదర్శన్‌రావు, దేవదాస్, గురురాజరావు, తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, ఎంపీడీఓలు జానయ్య, రహ్మతుద్దీన్, ఏఓ సుదర్శన్‌గౌడ్, ఏపీఎం బస్వరాజ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు గణేష్ కుమార్, ఆనంద్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, రవికుమార్, రాజేందర్, రాజప్పగౌడ, మాజీ ఎంపీపీ పూర్ణిమ పాటీల్, సోమ శేఖర్‌గౌడ్, సంతోష్, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మక్తల్: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీఓ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు నెలనెలా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పండగ వేళలో కూడా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, మల్లేష్, నర్సింహులు, వెంకటయ్య, చంద్రప్ప, రామచంద్ర పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ఆవశ్యకతపై ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కోస్గి: పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని జాతీయ హరిత దళ పాఠశాల సమన్వయకర్త మల్లేశం అన్నారు. మండలంలోని మీర్జాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 'పోషకాహారం–ఆహార భద్రత' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ప్రాణికి గాలి, నీరు తర్వాత ఆహారం ముఖ్యమైనదన్నారు. పౌష్టికాహారం ఆవశ్యకతపై గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ అవగాహన కరువైందన్నారు. ప్రతి విద్యార్థి పౌష్టికాహార ఆవశ్యకతను తెలుసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారాలని సూచించారు.

పాత సంతబజార్.. మురుగుమయం



పాత సంతబజార్‌లో నిలిచిన మురుగు

మరికల్: మండల కేంద్రంలో కొన్నేళ్ల పాటు వారాంతపు సంతకు ఉపయోగించిన పాత సంతబజార్ ప్రస్తుతం మురుగుమయంగా మారింది. మండల కేంద్రంలో ప్రధాన రహదారి నుంచి గజ్జలమ్మగడ్డ వీధికి వెళ్లే రహదారిపై దాదాపు 50 ఏళ్లకు పైగా సంతను నిర్వహించారు. మూడేళ్ల క్రితం బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలోకి సంత నిర్వహిస్తున్నారు. అప్పటి నుంచి పాత సంతబజార్ అస్తవ్యస్తంగా మారింది. మురుగునీటి గుంతలతో దుర్గంధ భరితంగా మారింది. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత సంతబజార్‌ను సీసీగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



ఊట్కూరులో ఎంఈఓకు జాయినింగ్ రిపోర్ట్స్ అందజేస్తున్న నూతన ఉపాధ్యాయులు



మాగనూరులో..

మాగనూర్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని మండల విద్యాధికారి మురళీధర్‌రెడ్డి నూతన ఉపాధ్యాయులకు సూచించారు. మండలానికి కేటాయించబడిన నూతన ఉపాధ్యాయులు బుధవారం ఎంఈఓకు జాయినింగ్ రిపోర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. కొత్త ఉపాధ్యాయుల స్థానంలో బదిలీ అయిన వారిని రిలీవ్ చేసినట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు బలరాం, ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, శ్రీనివాసులు, డేవిస్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి 20 మంది టీచర్లు..

ఊట్కూరు: మండలానికి కేటాయించిన నూతన ఉపాధ్యాయులు ఎంఈఓ రామచంద్రాచారి సమక్షంలో విధుల్లో చేరారు. 14 మంది ఎస్జీటీలు, ముగ్గురు ఎస్‌ఏలు, ముగ్గురు భాషా పండిట్లతో కలిపి మొత్తం 20 మంది విధుల్లో చేరినట్లు తెలిపారు. నూతన ఉపాధ్యాయులకు తపస్ మండల అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి గోపాల్, బస్నేష్, పృథ్వీరాజు తదితరులు స్వాగతం పలికారు.

వృత్తిలో రాణించాలి..

మరికల్: కొత్త ఉపాధ్యాయులు వృత్తిలో రాణించాలని ఎస్‌ఐ మురళి ఆకాంక్షించారు. ఉపాధ్యాయినిగా ఎంపికైన కానిస్టేబుల్ నాసిన్‌ను మరికల్ పోలీస్‌స్టేషన్‌లో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఎల్లయ్య పాల్గొన్నారు.

నేడు వాల్మీకి కమ్యూనిటీ భవనం ప్రారంభం

నర్వ: మండల కేంద్రంలో గురువారం వాల్మీకి కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. ఎమ్మెల్యే పర్యటనలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు



మద్దూరు: మిషన్ భగీరథ పథకంతో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలని మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ రంగరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మద్దూరు, కొత్తపల్లి మండలాల్లోని గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేసే వాటర్‌మేన్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఉమ్మడి మండల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం మిషన్ భగీరథ నీటి సరఫరా, తాగునీటి బోర్లు, చేతిపంపులు, పైపులైన్ల మరమ్మతు తదితర వాటిపై అవగాహన కల్పించారు. నాలుగు రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహారెడ్డి, ఎంపీఓ రామన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చెన్నప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న నారాయణపేట బస్టాండ్

నారాయణపేట రూరల్: దసరా పండగకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల తిరుగు ప్రయాణానికి సరిపడా బస్సులను ఏర్పాటు చేయడంలో ఆర్టీసీ విఫలమైంది. విద్యాసంస్థలు, కార్యాలయాలకు వేర్వేరు తేదీల్లో సెలవులు ఇవ్వగా.. పునః ప్రారంభం మాత్రం ఒకేసారి ఉండటంతో పెద్ద సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు సరిపడా బస్సులు లేక నానా అవస్థలు పడుతున్నారు. సోమ, మంగళవారాలతో పోలిస్తే, బుధవారం ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా స్థానిక ఆర్టీసీ అధికారులు బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో బస్టాండ్‌లో గంటల తరబడి నిరీక్షించారు. బస్టాండ్‌లో కనీసం కూర్చోడానికి సరిపడా కుర్చీలు, తాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. కొందరు చేసేది లేక బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణించారు. ఇదిలా ఉంటే, స్పెషల్ బస్సుల పేరిట 50 శాతం అదనంగా చార్జీలను వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెవెలుగు బస్సులకు ఎక్స్‌ప్రెస్ బోర్డులు తగిలించి, అధిక ధరలు వసూలు చేయడంపై మండిపడుతున్నారు. బుధవారం సాయంత్రం చిన్నజట్రం వరకు వెళ్లిన బస్సులో అదనపు చార్జీలపై గొడవ జరగడంతో తిరిగి నారాయణపేట డిపోకు చేరుకుంది. పోలీసుల సమక్షంలో ప్రయాణికులను సముదాయించాల్సి వచ్చింది. మరోవైపు జిల్లావ్యాప్తంగా వివిధ పల్లెలకు నడిపే బస్సులను రద్దు చేసి, హైదరాబాద్‌కు తిప్పుతున్నారు. రెండు రోజులుగా ఏ ఒక్క గ్రామానికి కూడా బస్సు సర్వీసులను నడిపించలేదు. ఫలితంగా విద్యాలయాలకు విద్యార్థులు రాలేకపోతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతానికి మించి విద్యార్థుల హాజరు నమోదు కాలేదు. ఈ విషయంపై డీఎం లావణ్యను ట్రస్మా నాయకులు కలిసి విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రిటైర్డ్ తహసీల్దార్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు జయంతి సందర్భంగా పద్మశాలి పట్టణ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు నీలికిషోర్ మాట్లాడుతూ ప్రభాకర్‌రావు జిల్లాలోని పద్మశాలీలను ఏకతాటి పైకి తెచ్చి చైతన్య పరిచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు.

జోరుగా కల్తీ కల్లు దందా



హౌజ్‌లో తయారు చేసిన కల్లు

ధన్వాడ: మండలంలోని కొండాపూర్‌లో కల్తీ కల్లు దందా జోరుగా సాగుతోంది. కల్లు తయారీకి యథేచ్ఛగా నిషేధిత ఆల్ఫ్రాజోలం, డైజోఫాం వినియోగిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కల్లు తయారీలోనూ కనీసంగా శుభ్రత పాటించడం లేదు. కలుషిత నీటితో కల్లు తయారు చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. కల్తీకల్లు తయారీపై ఆబ్కారీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. గ్రామంలో కల్లు గీసే వారి సంఖ్య ఒకటి, రెండుకు మించి లేదని.. కల్లు ఇచ్చే చెట్లు సైతం లేవని పేర్కొంటున్నారు. కాని అధికారుల లెక్కల్లో మాత్రం వేల చెట్లు ఉన్నట్లు చూపుతున్నారని చెబుతున్నారు. కృత్రిమంగా తయారు చేస్తున్న కల్లులో మత్తు కోసం ఆల్ఫ్రాజోలంను మోతాదుకు మించి కలుపుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కల్తీ కల్లు అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

21 నుంచి దేవేంద్రాచార్య ఆరాధన ఉత్సవాలు



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న గ్రామస్తులు

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో వెలసిన దేవేంద్రాచార్య మహాస్వాముల 72వ ఆరాధన ఉత్సవాలు ఈనెల 21 నుంచి 23 వరకు కొనసాగుతున్నాయని మఠ నిర్వాహకుడు నరసింహాచార్యులు తెలిపారు. దేవేంద్రాచార్య ఆరాధన ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మఠంలో బుధవారం విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేవేంద్రాచార్యులు గ్రామంలో శ్రీరామాచార్య, చంద్రాంబ దంపతులకు నాల్గో నెల 15 తేదీ 1885వ సంవత్సరంలో జన్మించారన్నారు. దేవేంద్రాచార్యులు చిన్న వయస్సులోనే తపోశక్తిని సాధించి ఎన్నో మహిమలను చూపుతూ ఇక్కడి ప్రజలకు ఆరాధ్యుడిగా మారారన్నారు. ఆరాధనోత్సవాలకు గాయత్రి పీఠాధీశ్వరుడు జగద్గురు శ్రీకాంతేంద్ర స్వామి, శ్రీకాళికాంబ ఉపాసకులు గుండెపల్లి నరేష్ ఆచార్యులు పాల్గొంటారన్నారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహులు గౌడ్, వెంకటేష్ ఆచారి, కల్వ నరసింహులు, నవీన్‌కుమార్, నందకుమార్ ఆచారి, కల్వ వీరేష్, వెంకట్రాంరెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

కంకినల్లి నుంచి వరి పైర్లను కాపాడాలి



కుత్నేపల్లిలో పత్తిపంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్

రాజాపూర్: రైతులు సాగు చేసుకున్న వరికి కంకినల్లి ఆశిస్తూ పంటలను పాడు చేస్తోందని, దాని నివారణకు తగు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ తెలిపారు. బుధవారం మండలంలోని బోడగుట్టతండా, కుత్నేపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కంకినల్లి నివారణకు స్పైరోమెసిటెన్ ఒక మిల్లీ లీటర్, ప్రోఫికనజోల్ ఒక మిల్లీ లీటర్ మందును లీటరు నీటితో కలిపి పదిహేను రోజులకు ఒకసారి పంటపై పిచికారీ చేయాలన్నారు. పత్తిలో కురుస్తున్న వర్షాల కారణంగా పంట చేలలో వర్షపునీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. ఏఈఓలు శ్రీనివాస్, మహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీపాండురంగస్వామి మూలవిరాట్



స్వామివారి విగ్రహాలు, ఆభరణాల ఊరేగింపులో భక్తులు



శ్రీపాండురంగస్వామి, రుక్మిణీమాత కల్యాణం

- భక్తిశ్రద్ధలతో కల్యాణం, పల్లకీసేవ

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్ల గ్రామంలో శ్రీపాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం వేలాది మంది భక్తుల సమక్షంలో ప్రముఖ వేదపండితుడు శ్రీధర్‌జ్యోషి ఆధ్వర్యంలో శ్రీపాండురంగస్వామి, రుక్మిణీమాత కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అలాగే స్వామివారి అలంకరణ ఆభరణాలు ఊరేగింపు, పల్లకీసేవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి భజనమండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. అలాగే గురువారం శ్రీపాండురంగస్వామివారి రథోత్సవం, మహామంగళహారతి, ప్రసాద వితరణ ఇతర పూజలు చేపడుతున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు యుగంధర్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వినయ్‌కుమార్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, భీమన్న, రాజశేఖర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

తోటల పునరుద్ధరణతో అధిక దిగుబడి



రుసుంపల్లి మామిడి అంటుకట్టును పరిశీలిస్తున్న ఉద్యానశాఖ డీడీ వేణుగోపాల్

గండేడ్: పాత తోటల పునరుద్ధరణతో అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా హార్టికల్చర్ అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రుసుంపల్లిలో మామిడికి అంటుకట్టడాన్ని పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పండ్లతోటల్లో కాపు కాయనివి, చిన్న చిన్న కాయలు కాసేవి, రోగాల బారిన పడినవి తదితర కొన్ని మొక్కలు ఉంటాయని ఆయన తెలిపారు. వాటి స్థానంలో కొత్త మొక్కలను పునరుద్ధరించడానికి అంటుకట్టు పద్ధతిని అవలంభించాలన్నారు. పాత మొక్కల కొమ్మలను రంపంతో సగం వరకు కోసి వేయాలన్నారు. కొన్ని రోజులకు పిలకలు వస్తాయన్నారు. ఆ పిలకలకు మంచి కాపు కాసే మొక్కల కొమ్మలు కట్ చేసి అంటు కట్టాలన్నారు. అది పెద్దయ్యాక కింద ఉన్న పాత మొక్కను తొలగించాలన్నారు. మార్కెట్‌లో డిమాండు ఉన్న రకాన్ని పండించే అవకాశం ఈ విధానం ద్వారా సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ స్వప్న, రైతులు పాల్గొన్నారు.